## క్లుప్తంగా

### ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి



నివాళులర్పిస్తున్న కార్పెంటర్స్ యూనియన్ నాయకులు

బనగానపల్లె రూరల్: టిప్పు సుల్తాన్ జయంతిని పట్టణంలోని కార్పెంటర్స్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు చాంద్‌బాషా మాట్లాడుతూ.. టిప్పు సుల్తాన్ పాలనలో దేశంలో ప్రాజెక్టులు, విద్యాసంస్థలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రిటీష్ వారిపై పోరాడిన ధీశాలి అని కొనియాడారు. కార్పెంటర్స్ యూనియన్ నాయకులు ఖాదర్‌బాషా, మహమ్మద్‌హుస్సేన్, అబ్దుల్‌సమద్, గోర మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

### సత్యసాయిబాబా జయంతి వేడుకలు



అఖండ భజనలు చేస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: స్థానిక గ్రంథాలయ సమీపంలోని సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం సత్యసాయి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని అభిషేకాలు, 24 గంటలపాటు అఖండ భజనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మందిరం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శివారెడ్డి, సభ్యులు రామశంకర్‌రెడ్డి, రంగారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, ఆర్‌టీఏ నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మహాసభలను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్ రూరల్: నంద్యాలలో ఈనెల 14వ తేదీ జరగనున్న ఏఐఎస్ఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, మోటారాముడు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. మహాసభల్లో విద్యారంగ అభివృద్ధిపై చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లాలో సొంత భవనాలు లేని హాస్టల్స్‌కు భవనాలు నిర్మించాలని కోరారు. నాయకులు మనోజ్, సిద్ధు, ప్రవీణ్, కిరణ్ పాల్గొన్నారు.

### 12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్

డోన్: పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ(పే రివిజన్ కమిషన్) నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సంఘం గౌరవాధ్యక్షుడు హనీఫ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్, అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 17వ తేదీ పెన్షనర్ల డేను ఘనంగా నిర్వహించేందుకు సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ సుబ్బరాయుడు, సంఘం సభ్యులు దాసప్ప, రాందాస్‌రెడ్డి, మౌలాలి, పురుషోత్తం, వీరయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

### ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

సంజామల: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమణయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవితం గడపాలని, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి ఫోన్ కాల్ వస్తే వ్యక్తిగత సమాచారం తెలపవద్దన్నారు.

# మాల ధారణ.. నియమాల ఆచరణ

- అయ్యప్ప దీక్షపై ఆసక్తి చూపుతున్న యువత
- నియోజకవర్గంలో ఏటా వెయ్యిమందికి పైగా మాలధారణ



కొలిమిగుండ్లలో పూజలు చేస్తున్న అయ్యప్పస్వాములు

కొలిమిగుండ్ల: శివకేశవుల తనయుడైన శ్రీమణికంఠుని మాలధారణ నియమ నిష్టలతో కూడుకున్న ఆచరణ. కార్తీక మాసం ప్రారంభం నుంచి అయ్యప్ప దీక్షలు ప్రారంభమవుతాయి. హరిహర సుతుడైన అయ్యప్ప కేరళ రాష్ట్రంలోని శబరిమల అడవుల్లో కొలువై ఉన్నాడు. శరీరాన్ని, మనసును చెడు నుంచి మంచి మార్గంలోకి మళ్లించే దీక్షనే స్వామి శరణమయ్యప్ప మండల దీక్ష. మోక్ష మార్గాన్ని అన్వేశించేవారు, సన్మార్గాన జీవనయాత్ర సాగించాలనుకునేవారు తప్పని సరిగా జీవితంలో ఒకసారైనా శబరిమల యాత్ర చేపట్టాలని కోరుకుంటారు. ఆధ్యాత్మికత, ఆరోగ్య సూత్రాలను మేళవింపచేసేది అయ్యప్పదీక్ష. స్వామి దర్శనానికి కంటే ముందు 18 మెట్లు అధిరోహించడం ద్వారా అజ్ఞానం తొలగి స్వామి అనుగ్రహం లభిస్తుందని దీక్షధారుల ప్రగాఢ నమ్మకం. ఏటా దీక్షాపరుల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల కాలంలో యువత మాలధారణ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. బనగానపల్లె నియోజవర్గంలో ఏటా వెయ్యి మందికి పైగా అయ్యప్పస్వామి మాల స్వీకరిస్తున్నారు.

**నియమాలు ఇలా**

అయ్యప్ప మాలను ఆలయంలో గురుస్వామి వద్ద లేదా ఇంట్లో మాతృమూర్తి వద్ద వేయించుకోవచ్చు. ప్రతి రోజు సూర్యోదయానికి ముందే పూజలు చేయాలి. సూర్యాస్తమయం తర్వాత పూజలు నిర్వహించాల్సి ఉంటుంది. నల్లటి దుస్తులు ధరించి 41 రోజుల పాటు కఠిన నియమాలు పాటించాలి. రాత్రి వేళల్లో ఆలయాల్లోనే నిద్రకు ఉపక్రమించడం శ్రేయస్కరం.

**ఇరుముడి ప్రాధాన్యత**

అయ్యప్పస్వామిని నవవిధ సేవలతో కొలుస్తుంటారు. శ్రవణం, కీర్తనం, పాదసేవనం, అర్చనం, నమస్కారం, ధ్యానం, స్మృతం, ఆత్మనివేదనలతో కొలుస్తుంటారు. అయ్యప్ప దీక్షలో ఇరుముడికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇందులో రెండు ముడులు ఉంటాయి. ముందున్న ముడిలో అయ్యప్ప స్వరూపమైన ముద్ర, కొబ్బరికాయ స్వామికి సమర్పించే వస్తువులను ఉంచుతారు. కొబ్బరికాయను నేతితో నింపుతారు. నెయ్యి జ్ఞానానికి ప్రతీకగా చెబుతుంటారు. కొబ్బరికాయకు బిగించే కార్క్‌ను వైరాగ్యానికి చిహ్నంగా భావించి మూతపెడుతారు. ఆపైన కాయకు ఆత్మ అనే లక్కతో సీలు వేస్తారు. జ్ఞానం అనే నెయ్యితోనే అయ్యప్పకు అభిషేకం చేస్తారు. మనలోని జ్ఞానాన్ని సంపూర్ణంగా స్వామి అయ్యప్పకు నిండు మనస్సుతో అర్పించుకున్నట్లుగా భావించడమే అర్థం. దీన్నే ఆత్మనివేదన అంటారు.

**అంతా భక్తి పారవశ్యమే**

శబరిమల యాత్ర ఆద్యంతం భక్తి పారవశ్యమే. భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఆలయం నుంచి ఇరుముడులు స్వీకరించి బృందంతో బయలు దేరుతారు. మొదటగా వావర్‌స్వామి కొలువైన ఎరిమేళికి చేరుకుంటారు. అక్కట పేటతుళ్లి ఆడి వావర్‌స్వామిని, పేటశాస్త్రిలను దర్శించుకుని పంబకు బయలు దేరుతారు. పంబానదిలో పుణ్యస్నానాలు ఆచరించి సన్నిధానంకు ఇరుముడులు మోసుకుంటూ స్వామియే శరణమయ్యప్ప నామస్మరణతో కొండ అంచున ఉన్న అప్పాచిమేడుకు చేరుకుంటారు. అక్కడి నుంచి కొంత దూరం ప్రయాణిస్తే శబరీపీఠం కనిపిస్తుంది. అక్కడ కన్నె స్వాములు శరం పుల్లలను ఉంచుతారు. అక్కడి నుంచి స్వామి సన్నిధానానికి వెళుతారు.

**పవిత్రమైన పదునెట్టాంబడి**

స్వామి సన్నిధిలో ఉండే 18 మెట్లను అవతార పురుషుడు పరుశురాముడు నిర్మించారని వాడుకలో ఉంది. అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నైరుతి, వరుణుడు, వాయుడు, కుబేరుడు, ఈశాన్యుడు, రెండు యోగములైన కర్మయోగం, జ్ఞాన యోగంతో పాటు విద్య, అవిద్య, జ్ఞానం, అజ్ఞానానికి రూపాలుగా ఈ18 మెట్లను ఏర్పరిచారు. సన్నిధానం చేరిన భక్తులు 18 మెట్లు ఎక్కే ముందు కొబ్బరికాయను కొట్టి ఎక్కుతారు. స్వామి దర్శనం అనంతరం ఇరుముడిని గురుస్వామి సాయంతో విప్పవలెను.

### మంచి జరుగుతుందని నమ్మకం



అయ్యప్పస్వామి మాలధారణ చేయడం వల్ల మంచి జరుగుతుందని నమ్మకం. ఇప్పటి వరకు 24 సార్లు మాల స్వీకరించాను. 41 రోజుల పాటు కఠిన నియమాలు పాటిస్తుంటాను. ఆధ్యాత్మిక చింతన పెరిగి మనసుకు సంతోషాన్ని కలిగిస్తుంది.

–సుబ్బరాయడు, కనకాద్రిపల్లె

### స్నేహభావం పెంపొందుతుంది



స్వామి మాలధారణ వల్ల జీవన ప్రమాణాలు పెరిగి స్నేహభావం ఏర్పడుతుంది. 1994 నుంచి క్రమం తప్పకుండా మాల స్వీకరిస్తున్నాను. మాల ధరించినపుడు అనుభూతి లభిస్తుంది. ఆరోగ్య పరంగా చాలా బాగుంటుంది. మొదట్లో తక్కువ మంది మాల స్వీకరించేవాళ్లు. ఏటా మాలధారుల సంఖ్య పెరుగుతోంది.

–జయరాముడు, కొలిమిగుండ్ల

### వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

### రంగస్వామి ఆలయ ద్వారానికి పంచలోహ తాపడం



బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె సమీపంలో వెలసిన పాలుట్ల రంగనాథస్వామి ఆలయ గర్భాలయ ద్వారానికి దాతల సహకారంతో పంచలోహ తాపడం చేయించారు. పాణ్యం మండలం గోనవరం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి, డోన్ మండలం ఆవులదొడ్డి గ్రామానికి చెందిన జానర్దన్‌శెట్టి భార్య జయమ్మ సుమారు రూ.80 వేలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అర్చకుడు విష్ణువర్ధన్ ఆచార్యులు, కమిటీ సభ్యులు రమణ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## హైందవ శంఖారావానికి కదలిరండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

అవుకు: విజయవాడలో వచ్చే ఏడాది జనవరి 5వ తేదీ జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు ప్రతి హిందువూ కదలిరావాలని హైందవ శంఖారావం జిల్లా కన్వీనర్ కిశోర్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం అవుకు గంగమ్మ ఆలయంలో సమావేశం నిర్వహించారు. హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కల్పించి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ధార్మిక వ్యవస్థకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు మణికంఠరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, దాసరి శ్రీనివాసులు, సతీష్, మునిస్వామి, బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాభివృద్ధికి రూ.50 వేల విరాళం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఇద్దరు భక్తులు రూ.50 వేల విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆదివారం తెలిపారు. మదనపల్లెకు చెందిన శంకరపు భాస్కర్ కుటుంబ సభ్యులు రూ.25వేలు, ఇదే గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి ఉదయకుమార్ కుటుంబం రూ.25వేలు అందజేసినట్లు పేర్కొన్నారు. వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న భక్తులు



సారాబట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

### బెల్లం ఊట ధ్వంసం

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో ఆదివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలో సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్ఐ కమలాకర్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. 4 సారా బట్టీలను ధ్వంసం చేసి 2,500 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. సారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టదా?

డోన్ రూరల్: ఉద్యోగాలు లేక చాలా మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని నక్కిరామన్న భవనంలో ఏఐవైఎఫ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చేసిన ఎంతో మంది యువకులు ఉద్యోగాలు లభించక సతమతమవుతున్నారని తెలిపారు. నూతన పరిశ్రమలను తీసుకొచ్చి ఉద్యోగాలను కల్పించాలని కోరారు. సమావేశంలో విద్యార్థి నాయకులు దివాకర్, సుంకయ్య, సీపీఐ నాయకులు నారాయణ, మోటారాముడు, రామ్మోహన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

## సీపీఎం మహా సభలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

డోన్ టౌన్: పట్టణంలో ఈ నెల 17న జరగనున్న సీపీఎం మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగరాజు, పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. మహాసభలో సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు కొండన్న, భాస్కర్‌రెడ్డి, చిన్నరహిమాన్, రామాంజనేయులు, నాగమద్దయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

బేతంచెర్ల: నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ పట్టణ కార్యాదర్శి నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. నిత్యావసర సరుకుల ధరలను కట్టడి చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇంటి నిర్మాణాలు నిలిచిపోయి కూలీలకు పనులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఈ నెల 18న గ్రామ సచివాలయాల ఎదుట ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, నాయకులు తిరుమలేష్, దస్తగిరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

### అనాథ శవానికి అంత్యక్రియలు

ప్యాపిలి: మండల పరిధిలోని నల్లబల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి (55) ఆదివారం మృతి చెందాడు. నల్లబల్లి గ్రామంలోని దేవాలయ పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసుకుంటూ జీవించే ఆ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో స్థానికుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు ప్యాపిలి పోలీసులు చెప్పారు.

### సమన్వయకర్త నియామకం

డోన్ టౌన్: కాంగ్రెస్ పార్టీ డోన్ నియోజకవర్గ సమన్వయకర్తగా చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన డాక్టర్ గార్లపాటి మద్దిలేటిస్వామిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

### వాల్మీకి చైర్మన్ పదవి బోయలకే ఇవ్వాలి

ప్యాపిలి: వాల్మీకి బోయ ఫెడరేషన్ చైర్మన్ పదవి బోయ కులస్తులకు ఇవ్వడమే సమంజసమని ఏపీ వాల్మీకి బోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న బొజ్జమ్మ తాము బోయలం కాదు ఏకిల నాయుడు కులస్తులమని ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్లు గుర్తు చేశారు. వాల్మీకి బోయలకు మాత్రమే వాల్మీకి, బోయల కష్టాలు తెలుస్తాయని తెలిపారు. బోయలం కాదన్న వారిని ఆ పదవిలో కొనసాగించకూడదన్నారు.

### రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బేతంచెర్ల: నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ శాంతియుత జీవితం గడపాలని సీఐ డి.వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో గొడవలు, నాటుసారా, అక్రమ మద్యం, పేకాట, మాట్కా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో క్షణికావేశంలో చేసిన తప్పులు మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు.

### ట్రాన్స్‌కో ఏఈ బదిలీ

కొలిమిగుండ్ల: స్థానిక ట్రాన్స్‌కో ఏఈ ప్రసన్న ఆంజనేయులు ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యారు. ఈయన రెండేళ్ల నుంచి ఇక్కడ పని చేస్తున్నారు. ఆ శాఖ ఉన్నతాధికారులు ఎమ్మిగనూరుకు బదిలీ చేయడంతో ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం ఆయన స్థానంలో ఏఈని నియమించాల్సి ఉంది. అవుకు ఏఈని ఇన్‌చార్జ్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయి.

### పొగాకు పంటకు ఎర్రతెగులు దెబ్బ

బనగానపల్లె: పొగాకు పంటకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఎర్రతెగులు సోకడంతో పెరుగుదల లోపించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది పంట సాగు చేసిన రైతులు మంచి లాభాలు పొందారు. నియోజకవర్గంలో చుక్కబర్లీ పొగాకును 1,500 ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటాకు రూ.13 నుంచి 15 వేలు గిట్టుబాటు ధర లభించింది. దీంతో మంచి లాభాలు పొందవచ్చనే ఉద్దేశంతో ఈ ఏడాది రైతులు ఈ పంట సాగుకు ఎక్కువగా మొగ్గు చూపారు. పంట సాగు విస్తీర్ణం రెండింతలైంది. బనగానపల్లె నియోజకవర్గంలో సుమారు 3 వేల ఎకరాల్లో పంట సాగు చేశారు. సెప్టెంబర్ నెలలో పంటను వేయగా అధిక వర్షాలతో ఆకులు ఎర్రగా మారి ఎదుగుదల లోపించిందని రైతులు వాపోతున్నారు. దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు పంటను పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



ఎర్రతెగులు ఆశించిన పొగాకు పంట

## రోడ్లపై మురుగునీరు పారబోస్తే చర్యలు

అవుకు: రోడ్లపై మురుగు నీరు పారబోస్తే చర్యలు తప్పవని గ్రామ పంచాయతీ అధికారులు చెత్త సేకరణ వాహనం ద్వారా హెచ్చరించారు. ఆదివారం సాక్షి దినపత్రికలో అన్నీ రోడ్లపైనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. రోడ్లపైన చెత్త, మురుగు నీరు పారబోసిన వారి ఇళ్లకు కొళాయి కనెక్షన్ తీసివేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ హరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని చెత్త సేకరణ వాహనం ద్వారా ప్రతి వీధిలోనూ మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేయించారు.



చెత్త సేకరణ వాహనం ద్వారా హెచ్చరిస్తున్న పంచాయతీ సిబ్బంది

## గిరిజన వలంటీర్లను ఆదుకోవాలి

డోన్ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 16 వేల మంది గిరిజన వలంటీర్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ చదివిన గిరిజన నిరుద్యోగులు తక్కువ జీతం అయినప్పటికీ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో వలంటీర్లుగా చేరారన్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు తీసుకెళ్లి మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో వలంటీర్లకు రూ.10వేల జీతం పెంచుతామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి వారితో ఓట్లు వేయించుకుని నేడు వలంటీర్లకు ఎలాంటి జీఓలు లేవని చెప్పడం దారుణమన్నారు. వలంటీర్లను ఆదుకోకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయడం లేదన్నారు. ఎన్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలేటి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు వెంకటేశ్వర్లు ఉన్నారు.

## ప్రభుత్వాస్పత్రిలో పౌష్టికాహారం పంపిణీ

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో దాత రమేష్ సహకారంతో గర్భిణులు, బాలింతలు, రోగులు, వారి సహాయకులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. రొట్టె, గుడ్డు, పప్పు, అరటి పండు అందజేశారు. కార్యక్రమంలో జాన్‌ప్రభాకర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం



బహుమతులు అందుకున్న చిన్నారులతో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

## సందడిగా రెడ్ల వనభోజనం

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని చౌడేశ్వరిమాత కల్యాణ మండపంలో ఆదివారం రెడ్ల కార్తీక వనభోజనం కార్యక్రమం సందడిగా జరిగింది. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రెడ్డి సంఘం నాయకుడు డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ..రెడ్డి కులస్తులు ఐక్యంగా ఉంటూ సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. పేద రెడ్ల విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. రెడ్డి వంశస్తులైన వేమారెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుద్దా వెంగళరెడ్డి సమాజ హితం కోరి అన్ని వర్గాల అభివృద్ధి కోసం తోడ్పాటు అందించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవకు పాటు పడాలన్నారు. అనంతరం నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి కార్తీక వనభోజన మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు హుసేన్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సభ్యులు బుగ్గన రమణారెడ్డి, మధు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



కార్తీక వన భోజనంలో చలంరెడ్డి, అర్జున్‌రెడ్డి తదితరులు

బనగానపల్లె: కార్తీక వనభోజనాలు ఐక్యమత్యానికి ప్రతీకగా నిలుస్తాయని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి నేలమఠంలో కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై సంఘం మహిళలతో కలిసి పూజలు చేశారు.